క్లుప్తంగా

గాయపడిన వృద్ధుడి మృతి

కమలాపురం : కమలాపురం మండలం పందిళ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన కె.సుబ్బయ్య (65) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుబ్బయ్య పందిళ్లపల్లె క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ వెనుక చక్రాల కింద పడ్డాడు. ఈ ఘటనలో సుబ్బయ్య రెండు కాళ్లు నుజ్జునుజ్జు కావడంతో పాటు చేయికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సుబ్బయ్య మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి దుర్మరణం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట్ల– తాడిపత్రి జాతీయ రహదారిపై కదిరివారిపల్లె గ్రామ క్రాస్ రోడ్డు ఐసీఎల్ మైన్స్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సీఐ ఈశ్వరయ్య గురువారం వివరాలు వెల్లడించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ముస్లిం, దుదేకుల కులానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోందన్నారు. కుడిచెయ్యి మణికట్టుపై కణితి ఉబ్బెతుగా ఉందన్నారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా దెబ్బతిందన్నారు. మృతుడి ఆచూకీ వివరాలు తెలిస్తే.. ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. 9121100530 సెల్ నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

అందుబాటులో విత్తనాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని రైతులకు సన్‌ఫ్లవర్ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు గురువారం ఏడీఆర్ డాక్టర్ ఎస్.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎన్‌డీఎస్‌హెచ్–102(ప్రభాత్)అనే ప్రొద్దుతిరుగుడు హైబ్రిడ్ రకం 20 క్వింటాళ్లు, ఐఎస్ఎఫ్–764 అనే కుసుమ రకం 15 క్వింటాళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రొద్దుతిరుగుడు విత్తనం కేజీ రూ.500 కాగా కుసుమ విత్తనం ధర రూ.110 ఇస్తారన్నారు. పూర్తివివరాల కోసం 99896 25208, 99666 65434 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పరామర్శ

ఎర్రగుంట్ల : తిప్పలూరు గ్రామానికి చెందిన జగదీశ్వర్ బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి గురువారం తిప్పలూరుకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

17 కరువు మండలాల కింద ప్రతిపాదనలు

- ఖరీఫ్‌లో తీవ్ర వర్షపాత లోటు
- 25 మండలాల్లో 27 డ్రైస్పెల్స్
- రిజర్వాయర్‌లలో తగ్గిన నీటిమట్టం

కడప సెవెన్‌రోడ్స్ : ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో 17 మండలాలను కరువు కింద ప్రకటించాలని జిల్లా యంత్రాంగం రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖకు ప్రతిపాదనలు పంపింది. దీనిపై ప్రభుత్వం నుంచి త్వరలో నిర్ణయం వెలువడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మైలవరం, చాపాడు, ప్రొద్దుటూరు, కడప, చింతకొమ్మదిన్నె మండలాల్లో కరువు తీవ్రత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. గోపవరం, ఖాజీపేట, జమ్మలమడుగు, వేముల, వీరపునాయునిపల్లె, కమలాపురం, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, పెండ్లిమర్రి, వేంపల్లె, చక్రాయపేట మండలాలను మోస్తరుగా, మిగతా మండలాలను సాధారణం కింద గుర్తించారు.

సూచికలు

వర్షపాత లోటు, పొడి వాతారణం (డ్రైస్పెల్స్ మ్యాండేటరీ ఇండికేటర్స్).. కరువు కింద ప్రకటించడానికి ఈ రెండు తప్పనిసరిగా వర్తించాలి. ప్రభావ సూచిక (ఇంపాక్ట్ ఇండికేటర్స్) కింద పంటల సాధారణ సాగు, మాయిశ్చర్ అడెక్వసీ ఇండెక్స్, నార్మలైజ్డ్ డిపరెన్షియల్ వెజిటేషన్ ఇండెక్స్, రిజర్వాయర్ స్టోరేజ్ ఇండెక్స్‌లను తీసుకుంటారు. నైరుతి రుతుపవనాల సమయంలో అంటే జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 405 మిల్లీమీటర్లు కాగా 349 మిల్లీ మీటర్లు కురిసింది. అంటే మైనస్ 13.9 మిల్లీమీటర్లు నమోదైంది. జూన్‌లో మైనస్ 43.8 జూలైలో మైనస్ 27.3, ఆగష్టులో మైనస్ 61.5 మిల్లీమీటర్లు, అక్టోబర్ మైనస్ 96.8 వర్షపాతం నమోదైంది. అయితే సెప్టెంబర్‌లో 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం అధికంగా కురవడంతో ఖరీఫ్‌లో మొత్తం సాధారణ వర్షపాతంలో కేవలం మైనస్ 13.9 మి.మీగా పరిగణించాల్సి వస్తోంది. ఇక జూన్ 4వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 25 మండలాల్లో 27 డ్రైస్పెల్స్ చోటు చేసుకున్నాయి. వరుసగా 21 రోజులు వర్షమే లేకపోతే దాని ఒక డ్రైస్పెల్స్‌గా పరిగణిస్తారు. రెండు డ్రైస్పెల్స్ సంభవించిన మండలాలు కూడా ఇందులో ఉన్నాయి.

నవంబర్ 2 తేదీ ఉదయం 8 గంటలకు ప్రాజెక్టుల పరిస్థితి

పేరు	సామర్థ్యం (టీఎంసీలు)	ఉన్నవి (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)
సీబీఆర్	10.229	4.839	0	55
గండికోట	26.850	16.430	0	5100
మైలవరం	6,500	2.668	3624	546
పైడిపాలెం	6.000	4.871	0	185
సర్వరాయ	3.060	0.698	0	30
వామికొండ	1.658	1.45	0	5
ఎస్ఆర్–1	2.135	0.297	0	10
ఎస్ఆర్–2	2.447	0.729	0	15
బ్రహ్మసాగర్	17.735	4.906	0	536

రిజర్వాయర్‌లలో తగ్గిన నీటిమట్టం

జిల్లాలోని 6 రిజర్వాయర్‌లలో సాధారణ నీటి నిల్వ సామర్థ్యం 54 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 31 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. డెడ్ స్టోరేజీ కింద 4.72 టీఎంసీలు పోను వినియోగానికి అందుబాటులో ఉన్నది 24.848 టీఎంసీలు. నవంబర్ నుంచి జనవరి వరకు ఖరీఫ్ బ్యాలెన్స్ సాగు నీరు 0.44, తాగునీటి అవసరాలకు 2.30, పారిశ్రామిక అవసరాలకు 1.10, రబీకి (డిసెంబర్–మార్చి) 8.470 అంటే మొత్తం 12.314 టీఎంసీలు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు.

పెన్నా నదికి నీటి విడుదల



పెన్నా నదికి నీటిని విడుదల చేస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం జలాశయం నుంచి పెన్నా నదిలోకి 200 క్యూసెక్కుల నీటిని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అధికారులతో కలిసి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా నది జలాలు గండికోట జలాశయానికి తెచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. జిల్లా ప్రజలను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలను గండికోటకు తెచ్చారని పేర్కొన్నారు. పెన్నా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు, రైతుల తాగు, సాగు అవసరాల దృష్ట్యా ప్రస్తుతం నీరు వదలడం జరిగిందన్నారు. కమలాపురం నియోజకవర్గంలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వరకు నీరు వచ్చి.. కేసీ కెనాల్ ద్వారా ఆయకట్టు పొలాలకు అందుతుందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి 3 టీఎంసీల నీటిని విడుదల చేయటకు అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. ప్రసుత్తం మైలవరం జలాశయంలో 2.66 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. అలాగే మైలవరం ఉత్తర కాలువ ద్వారా రోజూ 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. దీంతో మైలవరం, పెద్దముడియం, రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. దక్షిణ కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని సాగు, తాగు నీటి అవసరాలకు వదలడం జరిగిందని తెలియజేశారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం జలాశయం అధికారులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అవసరం
- జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు



కడప అగ్రికల్చర్ : జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల పలు చోట్ల వివిధ పంటలు ఎండుముఖం పట్టాయి. కావున రైతులు రక్షణ చర్యలు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు 'సాక్షి' ద్వారా రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలో సాగు చేసిన వివిధ పంటల్లో ఎండ బెట్టను తగ్గించుటకు పొటాషియం నైట్రేట్‌ను 6–8 గ్రాముల లీటరు నీటికి లేదా 13–0–45(ముటి–కె 6–8 గ్రాములు లీటర్ నీటికి లేదా 19:19:19ని 8–10 గ్రాములు లీటరు నీటికి కలిపి వారానికి రెండు సార్లు పంటలపై పిచికారి చేసుకోవాలని చెప్పారు. పంటలో మొక్కల సాళ్ల మధ్యలో హారోవింగ్ చేయడం ద్వారా భూమిలో కొంత వరకు తేమను పట్టుకునే సామర్థ్యం పెంచేలా చేస్తుందన్నారు. దీని ద్వారా మొక్కలు కొన్ని రోజులు బెట్టను తట్టుకునే పరిస్థితి ఉంటుందన్నారు. పొలంలో పూర్తిగా ఎండిపోయిన మొక్కలను తీసివేయడం వల్ల కూడా కొంత వరకు మిగిలిన మొక్కలు బెట్టను తట్టుకునే పరిస్థితి ఉంటుందన్నారు. ఉద్యాన పంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం ద్వారా కొంత వరకు బెట్టను తగ్గించుకోవచ్చన్నారు. వర్షభావ పరిస్థితుల వల్ల వివిధ పంటల్లో రసం పీల్చే పురుగుల బెడద, తెగుళ్ల వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కావున రైతులు తగిన రక్షణ చర్యలు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు.

వరి

వరి పంటల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల సుడిదోమ ఉధృతి పెరుగుతుంది. దీనిని నివారించుటకు డినోటెఫ్యురాన్ 0.4 గ్రాములు లీటర్ నీటికి లేదా పైమెట్రోజెన్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిసి పిచికారి చేసుకోవాలి. పాయు పొడ తెగులు, కాండం కుళ్లు శిలీంధ్ర తెగులు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. దీని నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లను లీటర్ నీటికి లేదా ప్రొపికోనజోల్ 1 మిల్లీమీటర్‌ను లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలి

వేరుశనగ

వేరుశనగ పంటను వివిధ తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

మినుము

మినుము పంటలో రసం పీల్చే పురుగులు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు డిఫెంథిసెరాన్ 1 గ్రాము ప్లస్ హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

జొన్న

జొన్న పంటలో మొవ్వ ఈగ/మొవ్వ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 36 గుళికలను ఎకరాకు 6–8 కేజీల చొప్పున వేసుకోవాలి.

పత్తి

పత్తి పంటలో రసం పీల్చే పురుగు, గులాబీ రంగు పురుగుల బెడద ఉంటుంది. రసం పీల్చే పురుగులను నివారించుటకు పసుపు లేదా నీలం రంగు జిగురు అట్టను ఎకరానికి 10 చొప్పున పొలంలో పెట్టుకోవాలి. డిఫెన్‌థిరాన్ 1 గ్రాము లీటరు నీటికి లేదా ఇమిడాక్లోప్రైడ్ 1 మిల్లీలీటర్‌కు 20 ఎంల్ నీటిని కలిపి కాండానికి పూతలాగా వేసుకోవాలి. అలాగే గులాబి రంగు పురుగును నివారించడానికి లింగాకర్షక బుట్టలు ఎకరాకు 10 చొప్పున పెట్టుకోవాలి. పురుగు ఆశించిన కాయలను తీసివేయాలి.

మిరప

మిరప పంటలో రసం పీల్చే పురుగులను నివారించుటకు డిఫెంథ్యూరాన్ 1 గ్రాము ప్లస్ హెక్సాకోనజోల్ 1 మిల్లీలీటర్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు సూచించారు.

తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు చేపట్టాలి

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్రగుంట్ల జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య తెలిపారు. గురువారం ఎంపీడీఓ సభ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఉపమండలాధ్యక్షుడు మల్లు వెంకటమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా పైపులైన్ మరమ్మతులు, బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రజలలో అపోహలు లేకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీపీపీలో వెలుబడే ఫ్లెయాస్ దుమ్ముతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దాని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహంతుల్లయ్య, డిప్యూటీ తాహసీల్దార్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి

వేంపల్లె : రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ప్రొద్దుటూరులో జార్జ్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్–14 విభాగంలో ముగ్గురు, అండర్–17 విభాగంలో నలుగురు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఘనంగా మహబూబ్ సుబహాని ఉరుసు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబె సుబహాని, ఖుత్‌బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిర్‌స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతకు పూజలు

కమలాపురం : వరుణ దేవుడు కరుణించి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురవాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ చెప్పలమ్మ (హేలాంబ) అమ్మవారికి ఆయన గురువారం 101 టెంకాయలు కొట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వల్లూరు : మండల వ్యాప్తంగా ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ కేఆర్‌ఎం ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమంపై సంభందిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు 25 రకాల పథకాలను ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా, 4 రకాల పథకాలను పరోక్ష నగదు బదిలీ విధానంలో అమలు చేస్తోందన్నారు. వీటికి సంభందించి ప్రతి గ్రామ సచివాలయంలో ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డుల ఆవిష్కరణను సంబంధిత నోడల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్ల ద్వారా విజయవంతం చేయాలన్నారు.

అభయహస్తం పింఛన్లు మంజూరు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా డ్వాక్రా సభ్యులుగా ఉండి అభయహస్తం ద్వారా ప్రతి ఏడాది సభ్యత్వం చెల్లిస్తున్న సభ్యులకు మండల వ్యాప్తంగా 39 మందికి అభయహస్తం పింఛన్లు మంజూరయ్యాయని ఏపీఎం మంజునాథ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో పాటు అదనంగా ప్రభుత్వం అభయ హస్తం ద్వారా వారికి ఈనెల 1వ తేదీ నుంచి రూ.500లు తీసుకోవచ్చన్నారు. గ్రామాల వారీగా బలపనూరు 1, అంకాలమ్మగూడూరు 1, చవ్వారిపల్లె 1, బి.చెర్లోపల్లె 1, హిమకుంట్ల 1, గురిజాల 4, కసనూరు 2, కోవరంగుట్టపల్లె 1, నక్కలపల్లె 5, నంద్యాలంపల్లె 1, తెలికి 1, సింహాద్రిపురం 20 మందికి అభయహస్తం పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 26 మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు అప్తాలమిక్ ప్యారా మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో పాఠశాలలో 240 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 26 మంది విద్యార్థులకు కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ లోపాలు ఉన్న విద్యార్థులకు గురువారం కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు.

భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల గ్రామంలో భక్తులు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం అర్ధ రాత్రి నుంచి ప్రారంభమైన ఉత్సవాలు గురువారం ఉదయం 8 గంటల వరకు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా తొగటవీర క్షత్రియులు జ్యోతులు నెత్తిన పెట్టుకుని చౌడేశ్వరిదేవి అమ్మ కీర్తనలు అలాపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

అరటిలో పొటాష్ ధాతు లోపం

పులివెందుల రూరల్ : శీతాకాలం అరటిపంటలో పొటాష్‌ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తోందని పొటాష్‌ధాతు లోపం వల్ల ఆకుల అంచుల వెంబడి పసుపు రంగు మారుతున్నాయని అరటి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త సుశీల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి పంటలో పొటాష్‌ధాతు నివారించడానికి రైతులు ఆకులపై 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్ లేదా 5 గ్రాములు 13–0–45 లీటరు నీటికి కలిపి 7 నుంచి 10 రోజుల కాలంలో రెండు లేదా మూడుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఇలా పిచికారీ చేయడం వల్ల అరటి పంటలో పొటాష్‌ధాతును నివారించవచ్చన్నారు.

'కుప్పం కూడా వైఎస్సార్‌సీపీదే'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల రూరల్, టౌన్ : తెలుగుదేశం నాయకులు ఎన్ని యాగాలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా రాష్ట్రంలో గెలవడం అసాధ్యమని అలాగే కుప్పం కూడా వైఎస్సార్‌సీపీదేనని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వాల్మీకి సంఘ డైరెక్టర్ నారాయణస్వామి, వై ఎస్సార్ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్‌లు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం పులివెందులలో తెదేపా కార్యాలయం ప్రారంభోత్సవంలో టీడీపీ నాయకులు పులివెందులలో కూడా టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పులివెందులలో కాదుకదా కుప్పంలో కూడా మీరు గెలవలేరన్నారు. అన్నా క్యాంటీన్, నీరు–చెట్టు ద్వారా మీరు ఎంత దోపిడీ చేశారో ప్రజలకు తెలుసన్నారు. వార్డు మెంబర్‌గా కానీ, సర్పంచ్‌గా కానీ గెలిచిన తర్వాత మీరు మాట్లాడితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పా ర్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ సచివాలయ పరిధిలోని రాజీవ్ నగర్‌కాలనీ, రజకకాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రతి ఒక్కరికి వివరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్‌దారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసుంబాషా

కడప కోటిరెడ్డి సర్కిల్ : వివిధ రకాల లీజుదారులు, స్టోన్ క్రషర్, మైనింగ్ క్వారీయింగ్ యజమానులు, మినరల్ డీలర్లు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశపు హాల్‌లో మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లీజుదారులు లీజు కాల పరిమితులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. చిన్నారులు, యువత, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు రంగం వారికి విజిలెన్స్‌పై అవగాహన కల్పించేందుకు కడపకు చెందిన విజిలెన్స్ విభాగం వారు వివిధ రకాలైన కార్యక్రమాలను అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్, మైనింగ్ అధికారులు ఎ.ఇదురు బాషా, శ్రీనివాసులు, బాలగంగాధరరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటికుంటల్లో గంబూషియా చేపపిల్లలు విడుదల



నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య

పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ పరిధిలోని విజయహోమ్స్ సమీపంలో ఉన్న నీటి కుంటలో, చిన్నకుడాల సమీపంలో ఉన్న నీటికుంటలో, బలపనూరు గ్రామం శివాలయం చెరువులో దోమల నియంత్రణ కోసం దోమ లార్వాను ఆహారంగా తీసుకునే గంబూషియా చేపపిల్లలను విడుదల చేసినట్లు సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు వర్షాకాలం సీజన్‌లో దోమలు విజృంభిస్తుంటాయి. ఈ సీజన్‌లో దోమల వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తుంటాయన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియాతో పాటు విషజ్వరాలు వస్తాయన్నారు. అందువల్ల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది దోమల సంఖ్యను నియంత్రించేందుకు, వాటిని నాశనం చేసేందుకు చెరువులు, చిన్నచిన్న కుంటలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూషియా చేపలను విడుదల చేశారు. గంబూషియా చేపలు దోమల్లాగే తక్కువ నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. దోమల లార్వాను తిని ఈ చేపలు పెరుగుతాయన్నారు. ఈ చేపలు రోజుకు సుమారు 150కి పైగా దోమల లార్వాలను తింటాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, లక్ష్మి, ఆశాకార్యకర్తలు శివకామేశ్వరి, రామాంజనేయలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నేడు వేంపల్లెలో ఎం.రాధికరెడ్డి సంతాప సభ


ఎం.రాధికరెడ్డి (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె జడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్‌రెడ్డి సతీమణి, గిడ్డంగివారిపల్లె మాజీ సర్పంచ్ మాచిరెడ్డి రాధికరెడ్డి తృతీయ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. రాధికారెడ్డి 2006లో గిడ్డంగివారిపల్లె గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె హయాంలో వార్డు సభ్యులందరూ మహిళలు కావడం విశేషం. గిడ్డంగివారిపల్లె గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. 2007లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిశుభ్రత అవార్డు అందుకున్నారు. 2008లో కేంద్ర ప్రభుత్వం నిర్మల్ గ్రామ ప్రధానం చేశారు. అనంతరం వేంపల్లె పట్టణంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని ఏర్పాటు చేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించారు. మండలంలో చాలా మంది పేద ప్రజల పిల్లలకు ఉచిత చదువులు చెప్పించారు. అనాథ వృద్ధులకు, పిల్లలకు, అన్నదాన దుస్తులు కూడా పంపిణీ చేసేవారు. ఆమె అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆమె 3 సంవత్సరాల క్రితం అకాల మరణంతో మండల ప్రజలు నేటికి కూడా ఆమె చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నారు.

వల్లూరు ఎంపీడీఓగా కేఆర్ఎం ప్రసాద్

వల్లూరు : వల్లూరులో ఈవోఆర్డీగా పనిచేస్తున్న కేఆర్ఎం ప్రసాద్‌ను ఎఫ్ఏసీ ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కే జుబేద రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రమోషన్లలో భాగంగా డీఎల్‌డీఓగా నియమితులయ్యారు.

పులివెందుల ట్రాఫిక్ సీఐగా సురేష్‌రెడ్డి



పులివెందుల : పులివెందుల ట్రాఫిక్ సీఐగా ఎ.సురేష్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పోరుమామిళ్ల, కలకడ ప్రాంతాల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

మహానేత వైఎస్సార్‌కు నివాళులు


వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న చర్చి పాస్టర్లు

వేంపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధికి పులివెందుల సీఎస్ఐ చర్చి పాస్టర్లు సి.ఆనందరావు, మృత్యుంజయుడులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఆత్మల రోజు పురస్కరించుకుని ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాటును సందర్శించారు. రెండు నిమిషాల పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చి డికెన్స్ అంజయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

జమ్మలమడుగు : పట్టణ, గ్రామాలలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న ట్రబుల్‌మాంగర్స్, రౌడీషీటర్లు, తదితరులకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో ప్రతి ఒక్కరిపై తాము ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కాబట్టి ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు జాగ్రత్తగా మసులుకోవాలన్నారు. రాబోయేది ఎన్నికల సీజన్ కావడంతో గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టవర్ పని నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ గురుమోహన్‌రెడ్డి తెలిపారు. దీంతో గండిరోడ్డు, ఇమామ్‌నగర్, బిడాలమిట్ట, శ్రీరామ్‌నగర్, పుల్లయ్యతోట, రాజారెడ్డి నగర్, చింతల మడుగుపల్లె, నేలవరంతాండా, బోల్లగొండి చెరువు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.